# 19096 వద్ద బలమైన నిరోధం




**సమీక్ష :** మూడు వారాల లాభాల తరువాత మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనైంది. చివరకు 296 పాయింట్ల నష్టంతో 18562 వద్ద స్థిరపడింది. ఉత్సాహపరచని అమెరికా ఆర్థిక గణాంకాలకు తోడు యూరోజోన్ సంక్షోభం ఇటలీ, పోర్చుగల్‌లకూ విస్తరించవచ్చన్న భయాల మధ్య మార్కెట్ ప్రతికూలంగా ఆరంభమైంది. బలహీన ధోరణిలో ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు, ఆశించిన స్థాయి కన్నా తక్కువగా నమోదైన భారత పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి.. వెరసి మార్కెట్ పతనమైంది. మంగళవారం నాటికి 18326 వద్ద వారపు కనిష్ఠ స్థాయికి దిగజారింది. ఆర్థిక రంగంలో వృద్ధి మందగిస్తోందా అన్న సంకేతాల మధ్య కఠినతర ద్రవ్య విధాన చర్యలకు పగ్గమేయక ఆర్‌బీఐకి తప్పక పోవచ్చన్న అంచనాలు, మరో పక్క టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం అనుకున్న దానితో పోలిస్తే ఒకింత తగ్గడంతో మార్కెట్లు ఊపిరి పీల్చుకొన్నాయి. అయితే అంతర్జాతీయ బలహీనతలు, ముంబయి పేలుళ్ల లాభాలను అడ్డుకోగా, చైనా ఆర్థిక గణాంకాలు, దేశీయ పరోక్ష పన్నుల వసూళ్ల అధిక నష్టాలను నివారించాయి.

**ఎఫ్‌ఐఐల పనితీరు:** విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐలు) రూ.721 కోట్ల విలువైన నికర కొనుగోళ్లు జరపగా, మ్యూచువల్ ఫండ్‌లు నికరంగా రూ.147 కోట్ల విలువైన కొనుగోళ్లు జరిపాయి.

**రంగాల వారీగా:** ఇన్ఫోసిస్ ఫలితాల కారణంగా ఐటీ సూచీ అత్యధికంగా నష్టపోయింది. అంతర్జాతీయ లోహ ధరలు దిగువకు రావడంతో, లోహ షేర్లు డీలా పడ్డాయి. స్థిరాస్తి షేర్లు లాభాల స్వీకరణకు గురయ్యాయి. కాగా, ఆరోగ్య సంరక్షణ, చమురు-సహజవాయువు, మన్నికైన వినియోగ వస్తువుల సూచీలకు తక్కువ స్థాయిలో కొనుగోళ్లు కనిపించాయి.

లాభపడ్డ షేర్ల, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదవడాన్ని బట్టి చూస్తే మధ్య విలువ, చిన్న విలువ షేర్లలో ఆసక్తి వ్యక్తం అయినట్లు తెలుస్తోంది.

**భవిష్యత్ అంచనా:** కీలక నిరోధ స్థాయిల వద్ద మార్కెట్ రికవరీని కొనసాగించలేకపోయింది. 18552 కీలక స్థాయి దిగువన మార్కెట్ స్థిరపడడం.. స్వల్ప కాల అధోముఖ ధోరణిలోకి అడుగుపెట్టినట్లు సూచిస్తోంది. 200 రోజుల చలన సగటు (డీఎమ్ఏ) అయిన 19096 వద్ద బలమైన నిరోధం ఉంది. ఈ స్థాయిని దాటితేనే స్వల్ప కాల ఊర్ధ్వ ముఖ ధోరణిలోకి మార్కెట్ అడుగుపెట్టిందని భావించాలి.

**ప్రభావిత అంశాలు:** త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో చలనాలు కొనసాగనున్నాయి. ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం దిగి వస్తే వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే బ్యాంకింగ్ వంటి షేర్లపై మదుపుదారులు ఆసక్తిని ప్రదర్శించవచ్చు. స్వల్ప కాలానికి రుతుపవనాల ప్రగతి కూడా ప్రభావాన్ని చూపనుంది. అంతర్జాతీయంగా యూరోజోన్ సంక్షోభ పరిణామాలు, ఎఫ్ఐఐల పెట్టుబడులు మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి.

**తక్షణ మద్దతు స్థాయిలు: 18326, 18133, 17844; తక్షణ నిరోధ స్థాయిలు: 18767, 18936, 19096**

**స్వల్ప కాలంలో మార్కెట్‌కు 19096 బలమైన నిరోధంగా కొనసాగనుంది.**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*